క్లుప్తంగా

ప్రజలందరికీ సురక్షిత తాగునీరు



మాట్లాడుతున్న ఏఈ పవన్‌రాజు

రామచంద్రాపురం: ప్రజలందరికీ సురక్షితమైన తాగునీరు అందించడానికే ప్రభుత్వం నీటి నాణ్యతను పరీక్షించే పరికరాలు అందజేసినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పవన్‌రాజు తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం ఎంపీడీవో మహ్మద్ రఫీ ఆధ్వర్యంలో నీటి నాణ్యతను పరీక్షించే విధానంపై శిక్షణ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ ఈ పరికరాలను క్రమం తప్పకుండా వినియోగించి ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించాలన్నారు.

సహాయక చర్యలు పూర్తి



తిరుపతి కొర్లగుంటలో చెత్త, చెట్లను తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

తిరుపతి తుడా: తిరుపతి నగరంలో గురువారం సాయంత్రం కురిసిన భారీ వర్షంతో పాటు పెనుగాలులకు పలు ప్రాంతాల్లో చెట్లు నేల కొరిగాయి. విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. కాలువలు పొంగిపొర్లడంతో చెత్తాచెదారం రోడ్లపై చేరింది. ఈ క్రమంలో తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ సిబ్బంది గురువారం రాత్రి నుంచి యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టారు. శుక్రవారం మధ్యాహ్నం వరకు సహాయక చర్యలు కొనసాగాయి.

గేట్ విద్యార్థులకు ఉద్యోగాలు



ఉద్యోగాలు సాధించిన విద్యార్థులతో హెటెరో సంస్థ, కళాశాల ప్రతినిధులు

తిరుపతి ఎడ్యుకేషన్: తిరుపతి భవానీనగర్ సర్కిల్‌లోని గేట్ కళాశాలలో గురువారం హెటెరో ల్యాబ్స్ లిమిటెడ్ సంస్థలో ఉద్యోగాల భర్తీకి క్యాంపస్ సెలక్షన్స్ నిర్వహించారు. సంస్థ ప్రతినిధులు వివిధ దశల్లో ఎంపిక ప్రక్రియ చేపట్టారు. ప్రతిభ చూపిన 19 మందిని పలు ఉద్యోగాలకు ఎంపిక చేశారు. వారిని గేట్ కళాశాల చైర్మన్ డాక్టర్ తమ్మినేని వెంకటేశ్వర్లు అభినందించారు.

28 మందికి జరిమానా

తిరుపతి లీగల్: తిరుమలలో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్న 28 మందికి రూ.14,600 వేల జరిమానా విధిస్తూ తిరుపతి 2వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి పల్లపోలు కోటేశ్వరరావు శుక్రవారం తిరుమల క్యాంప్ కోర్టులో తీర్పు చెప్పారు. తిరుమల టూటౌన్ పోలీస్ స్టేషన్ పరధిలో 16 మంది, వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఏడుగురు, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఐదుగురిపై కేసులు నమోదు చేసి నిందితులను న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు.

చంద్రగిరిలో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ తనిఖీలు



చంద్రగిరిలో రెస్టారెంట్లు, దుకాణాల్లో ఆహార పదార్థాలను తనిఖీ చేస్తున్న ఫుడ్ ఇన్‌స్పెక్టర్

చంద్రగిరి(తిరుపతి రూరల్): చంద్రగిరిలోని పలు దుకాణాలను శుక్రవారం జిల్లా ఆహార కల్తీ నిరోధక శాఖ అధికారి (ఫుడ్ ఇన్‌స్పెక్టర్) మద్దులేటి తనిఖీ చేశారు. ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే నూనె, ఇతర పదార్థాలను ఎవరైనా వాడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే తోపుడు బండ్ల పైన, రోడ్ల పక్కన తయారు చేసే చికెన్ పకోడీలు, బజ్జీలకు వాడే నూనె ఇతర పదార్థాల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు.

ఆరుగురిపై కేసు

ఏర్పేడు: ఖాళీ స్థలాల వివాదం నేపథ్యంలో దాడికి పాల్పడిన ఘటనలో ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ శ్రీహరి శుక్రవారం రాత్రి తెలిపారు. మండలంలోని నాగంపల్లెకు చెందిన చెంగారెడ్డి(67) శుక్రవారం తమ ఇంటి వద్ద కూర్చొని ఉండగా రోహిత్, శంకర్, లక్ష్మి, నరసయ్య, రఘురాం, యుగంధర్ దాడి చేసి గాయపరిచారు. చెంగారెడ్డికి గాయాలయ్యాయి. అతడి ఫిర్యాదు మేరకు ఆరుగురిపై కేసు నమోదు చేశారు. అలాగే భూతగాదాతో ఓ వ్యక్తిపై దాడిచేసిన నలుగురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. నాగంపల్లెకు చెందిన మునిరెడ్డి(67)పై భూతగాదాతో గ్రామానికి చెందిన మహానందరెడ్డి, లక్ష్మయ్య, శేషాద్రి, మణిరెడ్డి ఈ నెల 7న దాడిచేసి గాయపరిచారు. అప్పట్లో పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశాడు. ఈ నెల 25న కేసును ఉపసంహరించుకోవాలని బాధితుడిని బెదిరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేశారు.

గంగమ్మకు భక్తుల పొంగళ్లు





విశేషాలంకరణలో తాతయ్యగుంట గంగమ్మ











తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ దర్శనానికి వచ్చిన భక్తులు, వెయ్యికళ్ల దుత్తలతో ప్రదక్షిణలు చేస్తున్న పిల్లలు, యువతులు

తిరుపతి కల్చరల్: తాతయ్యగుంట గంగమ్మకు శుక్రవారం భక్తులు పెద్ద ఎత్తున పొంగళ్లు పెట్టారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో ఆలయం కిటకిటలాడింది. అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించి సర్వాంగ సుందరంగా కొలువు తీర్చారు. భక్తులు కుటుంబ సమేతంగా పెద్ద సంఖ్యలో తరలివచ్చి పొంగళ్లు వండి అమ్మవారి కొడి స్తంభం వద్ద నైవేద్యం సమర్పించి పిండి దీపాలు పెట్టి ఆరాధన చేశారు. కొందరు భక్తులు గంగబొట్లు పెట్టుకుని నెత్తిన వేయికళ్ల దుత్తలు ఎత్తుకుని, వేపాకులు చేతపట్టి ఆలయ ప్రదక్షణ చేసి మొక్కులు తీర్చుకున్నారు.

సివిల్స్ టాపర్‌కు కలెక్టర్ సన్మానం



జీవీఎస్ పవన్‌దత్తను సన్మానిస్తున్న కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి

తిరుపతి అర్బన్: సివిల్స్‌లో రాష్ట్రంలో మొదటి ర్యాంక్ సాధించిన జీవీఎస్ పవన్‌దత్తను కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి సత్కరించారు. తిరుపతికి చెందిన డాక్టర్ జీవీఎస్ పవన్‌దత్త 2014 బ్యాచ్‌లో డాక్టర్ పట్టాను పొందారు. అనంతరం ఆయన సివిల్స్‌పై దృష్టిసారించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో ఎం.శ్రీనివాసరావు, సెట్విన్ సీఈవో వి.మురళీకృష్ణ, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు వై.ప్రవీణ్, పవన్ దత్త తల్లిదండ్రులు లలితకుమారి, జి.వెంకటేశ్వర్లు, కే.రాధాకృష్ణ వర్మ, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ హరికృష్ణ పాల్గొన్నారు.

టీటీడీ మాజీ ఈవో మృతికి సంతాపం

తిరుపతి కల్చరల్: టీటీడీ మాజీ ఈవో ఎంవీఎస్.ప్రసాద్ మృతికి సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కందారపు మురళి ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. ఆయన ఈవోగా ఉన్న సమయంలో ఉద్యోగ, కార్మిక సమస్యల పరిష్కారంతోపాటు అనేక మంది ఉద్యోగులు పర్మనెంట్ కావడానికి ఎంతో కృషి చేశారని గుర్తు చేశారు. ఆయన మృతి బాధాకరమని తెలిపారు. ఎంవీఎస్.ప్రసాద్ కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

అడ్వర్‌టైజింగ్ బకాయిదారులపై ఉక్కుపాదం



టౌన్ ప్లానింగ్ అధికారులతో సమీక్షిస్తున్న కమిషనర్ హరిత

తిరుపతి తుడా: తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌కు బకాయిలు వున్న అడ్వర్‌టైజింగ్ సంస్థలకు నోటీసులు జారీ చేయాలని కమిషనర్ హరిత అధికారులను ఆదేశించారు. ఆమె శుక్రవారం టౌన్ ప్లానింగ్ అధికారులతో సమావేశమయ్యారు. ఆమె మాట్లాడుతూ అడ్వర్‌టైజింగ్ ప్రచారాలు చేసుకుంటూ నగదు చెల్లించని వారిపై ఉక్కుపాదం మోపనున్నట్లు చెప్పారు. ముందస్తుగా నోటీసులు జారీ చేయాలని, అప్పటికీ స్పందించని పక్షంలో శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే అనుమతులు లేకుండా నగరంలో బోర్డులు, ప్రకటనలకు సంబంధించినవి ఏర్పాటు చేస్తే చర్యలు తప్పవనే విషయాన్ని అందరికీ తెలియజేయాలన్నారు. శ్రీనివాస సేతు పిల్లర్స్‌పై ప్రకటనలు, బోర్డులు ఏర్పాటుచేసి తిరుపతి పవిత్రతకు భంగం కల్గించిన వారిపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసి క్రిమినల్ కేసులు నమోదు చేయించాలని సూచించారు. సమావేశంలో అదనపు కమిషనర్ సునీత, అసిస్టెంట్ సిటీ ప్లానర్లు బాలసుబ్రమణ్యం, షణ్ముగం, టీపీఎస్‌లు శారదాంబ, సాయిలీల, ధర్మరాజు, సూపరింటెండెంట్ హాసిమ్, రాజశేఖర్ పాల్గొన్నారు.

ప్రజలకు ఇబ్బంది లేకుండా చెట్ల తొలగింపు



అధికారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ మునిరామిరెడ్డి

తిరుపతి మంగళం: తిరుపతి నగరంలో గురువారం సాయంత్రం గాలీవాన బీభత్సానికి నేలకొరిగిన భారీ వృక్షాలను సకాలంలో తొలగించి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని 8వ డివిజన్ కార్పొరేటర్ మునిరామిరెడ్డి అధికారులను కోరారు. 8వ డివిజన్‌లో పలు భారీ వృక్షాలు నేలకొరిగాయి. విద్యుత్ స్తంభాలు విరిగి కింద పడ్డాయి. దీనిపై స్పందించిన కార్పొరేటర్ మునిరామిరెడ్డి ఆయా కాలనీల్లో పర్యటించారు. విద్యుత్ తీగలను సరిచేసి స్థానికులకు విద్యుత్ సరఫరా అందించాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు.

మాస్టర్‌మైండ్స్ ప్రతిభా పురస్కారాలు

తిరుపతి ఎడ్యుకేషన్: పదో తరగతి పబ్లిక్ పరీక్షా ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ఆదివారం ఉదయం 10 గంటలకు అన్నమయ్య సర్కిల్ సమీపంలోని మాస్టర్ మైండ్స్ కళాశాలలో ప్రతిభా పురస్కారాలు అందజేయనున్నట్లు కళాశాల అడ్మిన్ ప్రిన్సిపాల్ ఆర్.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పురస్కారాలకు స్టేట్, ఐసీఎస్ఈ సిలబస్‌లో 550కి పైగా, సీబీఎస్ఈ సిలబస్‌లో 450కి పైగా మార్కులు సాధించిన విద్యార్థులు అర్హులని, వీరికి జ్ఞాపికతో పాటు నగదు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఆధార్, స్కూల్ ఐడీ కార్డు, పదో తరగతి మార్క్స్‌లిస్ట్(ఇంటర్నెట్ కాపీ)ను తీసుకురావాలని తెలిపారు. వివరాలకు 8978180843, 8008577927లో సంప్రదించాలని కోరారు.

నిత్యావసర సరుకుల వితరణ



సరుకులు అందజేస్తున్న కొత్తపాటి మునీశ్వరరెడ్డి

తిరుపతి రూరల్: మండలంలోని పెరుమాళ్లపల్లి పంచాయతీలోని 20 మంది పారిశుద్ధ్య కార్మికులకు శుక్రవారం వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కొత్తపాటి మునీశ్వరరెడ్డి నిత్యావసర సరుకులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ పది రోజుల క్రితం పంచాయతీలో గంగమ్మ జాతరను అంగరంగ వైభవంగా నిర్వహించినట్లు తెలిపారు. పారిశుద్ధ్య కార్మికులు గ్రామాన్ని ఎంతో సుందరంగా ఉంచారని పేర్కొన్నారు. వారి సేవలను గుర్తించి నెల రోజులకు సరిపడా నిత్యావసర సరుకులు అందజేసినట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ జోగి మోహన్, ఉపసర్పంచ్ వెంకటనారాయణ, బొందు భాస్కర్ రెడ్డి, దామోదర్ రెడ్డి, కేశవరెడ్డి పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి కృషి చేయండి



మాట్లాడుతున్న ఎంపీపీ ఏవీ బ్రహ్మానందరెడ్డి

రామచంద్రాపురం: అధికారులు గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని ఎంపీపీ ఏవీ బ్రహ్మానందరెడ్డి తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అధికారులు పంచాయతీల్లో పర్యటించి ప్రజల సమస్యలను పరిష్కరించాలన్నారు. గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా సత్వరం చర్యలు చేపట్టాలన్నారు. గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించాలని సూచించారు. జెడ్పీటీసీ ఢిల్లీ భానుకుమార్‌రెడ్డి మాట్లాడుతూ రేషన్ కార్డుల మంజూరుపై సచివాలయ సిబ్బంది ప్రత్యేక చొరవ చూపాలన్నారు. ఇంటి నిర్మాణ బిల్లులు లబ్ధిదారులకు సకాలంలో అందేలా చర్యలు చేపట్టాలని హౌసింగ్ ఏఈ మహేశ్వర్ నాయుడుకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ మహ్మద్ రఫీ, తహసీల్దార్ చిన్న వెంకటేశ్వర్లు, సింగిల్ విండో చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు రూ.10 లక్షల విరాళం



టీటీడీ ఈవో ఏవీ.ధర్మారెడ్డికి చెక్కు అందజేస్తున్న దాత

తిరుమల: హైదరాబాదుకు చెందిన శ్రీనివాసులు రెడ్డి టీటీడీ ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు రూ.10 లక్షలు విరాళంగా ఇచ్చారు. ఆయన శుక్రవారం చెక్కును తిరుమలలోని ఈవో క్యాంపు కార్యాలయంలో ఈవో ఏవీ.ధర్మారెడ్డికి అందజేశారు.

ప్రజా ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించాలి



అధికారులతో సమీక్షిస్తున్న కమిషనర్ హరిత

తిరుపతి తుడా: ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించాలని తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ డి.హరిత అధికారులను ఆదేశించారు. ఆమె శుక్రవారం జగనన్నకు చెబుదాం, స్పందన, డయల్ యువర్ కమిషనర్ వినతులపై అధికారులతో సమీక్షించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి ఫిర్యాదుకూ పరిష్కారం చూపించాల్సిన బాధ్యత ఆ శాఖ అధికారిదేనన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వచ్చే ఫిర్యాదులను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించాలని సూచించారు. పాఠశాలలు పునఃప్రారంభం లోపే నాడు–నేడు పనులు పూర్తి చేయాలన్నారు. సమావేశంలో అదనపు కమిషనర్ సునీత, డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర రెడ్డి, ఎస్ఈ మోహన్, హెల్త్ ఆఫీసర్ హరికృష్ణ, ఎంఈ వెంకట్రామిరెడ్డి, రెవెన్యూ ఆఫీసర్ సేతు మాధవ్, ఏసీపీ బాలసుబ్రమణ్యం, షణ్ముగం తదితరులు పాల్గొన్నారు.

ఉయ్యాల సేవలో పద్మావతీ అమ్మవారు

నారాయణవనం: పద్మావతీ సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం సాయంత్రం పద్మావతీ అమ్మవారు ఉయ్యాల సేవలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నిత్యపూజలు చేసి 7 గంటలకు వెంకన్నకు, 8 గంటలకు పద్మావతీ అమ్మవారికి శుక్రవార అభిషేకాలు చేశారు. సాయంత్రం అమ్మవారు తిరుచ్చి వాహనాన్ని అధిరోహించి అంతర ప్రాకారంలో విహరించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

జాయింట్ సెక్రటరీగా కల్లూరు కిశోర్



తిరుపతి ఎడ్యుకేషన్: ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల ఫెడరేషన్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా ఎస్వీ యూనివర్సిటీ అకడమిక్ కన్సల్టెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కల్లూరు కిశోర్ కుమార్‌రెడ్డి నియమితులయ్యారు. ఆ మేరకు ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కె.వెంకటరామిరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. తనపై నమ్మకముంచి పదవిని అప్పగించిన రాష్ట్ర అధ్యక్షుడు, అలాగే తన నియామకానికి కృషి చేసిన తూర్పు రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డికి కిశోర్‌కుమార్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

ప్రమాదకరంగా హోర్డింగ్స్



సామవాయువు రోడ్డుపై వేలాడుతున్న హోర్డింగ్

తిరుపతి నగరంలో గురువారం వీచిన ఈదురు గాలులు, భారీ వర్షానికి పలు ప్రాంతాల్లో ఫ్లెక్సీలు, హోర్డింగ్స్ విరిగిపోయాయి. నిత్యం వాహనాలతో రద్దీగా ఉండే బస్టాండ్ సర్కిల్, సామవాయువు రోడ్లలో ఉన్న హోర్డింగ్స్ వేలాడుతున్నాయి. వాటిని వెంటనే తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి



బస్టాండ్ సర్కిల్ వద్ద వేలాడుతున్న హోర్డింగ్స్

భక్తులకు అన్నదానం



చంద్రగిరి(తిరుపతి రూరల్): చంద్రగిరి పట్టణంలోని మూలస్థానమ్మ ఆలయంలో శుక్రవారం భక్తులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, రాహుకాల పూజలు చేశారు. అష్ట దేవతలు, వినాయకుడు, బాలసుబ్రహ్మణ్యం స్వామికి, నవగ్రహాలకు, నాగాలమ్మకు విశేష పూజలు చేశారు. దాదాపు 100 మంది మద్యం ప్రియులు అమ్మవారి ఎదుట మద్యం ముట్టనని సత్య ప్రమాణం చేశారు. మధ్యాహ్నం చంద్రగిరి పట్టణం గ్రామ పినపెద్ద విరూపాక్షి శంకర్ రెడ్డి, మమత వెయ్యిమంది భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ ట్రస్ట్ చైర్మన్ చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

జూన్ 2న వేదనారాయణుని కంచి గరుడ సేవ

పిచ్చాటూరు: జూన్ 2న నాగలాపురంలోని శ్రీ వేదనారాయణ స్వామి ఆలయంలో కంచి గరుడ సేవ నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. కంచిలో శ్రీ వరదరాజస్వామి ఆలయంలో గరుడ సేవను పురస్కరించుకుని నాగలాపురంలో ఈ సేవ నిర్వహించడం ఆనవాయితీ. 2న ఉదయం 6.30 నుంచి 8.30 గంటల మధ్యలో సర్వాలంకార భూషితుడైన స్వామివారు గరుడ వాహనంపై అధిష్ఠించి, తిరువీధుల్లో విహరిస్తూ, భక్తులకు దర్శనమిస్తారని టీటీడీ అధికారులు తెలిపారు.